క్లుప్తంగా

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ రాజశేఖర్, సిబ్బంది

సిద్దవటం : అక్రమ మద్యాన్ని అరికట్టేందుకు మండలంలోని మాచుపల్లె – కడప రహదారిలో విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశామని సిద్దవటం ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇతర జిల్లాల నుంచి వచ్చే అక్రమ మద్యాన్ని అరికట్టేందుకు రోజువారి తనిఖీల్లో భాగంగా వాహనాలను తనిఖీ చేశామన్నారు. అక్రమ మద్యం రవాణాను అరికట్టేందుకు గట్టి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సిద్దవటం ఎక్సైజ్ పరిధిలో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవచనాలతో ప్రయోజనం

నందలూరు : గీత ప్రవచనామృతములను వినడం ద్వారా ప్రయోజనం ఉంటుందని విశ్రాంత తహసీల్దార్ నాయనపల్లి జయన్న, గెలివి రత్నం శెట్టిలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం వారు మాట్లాడుతూ మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ, అరవపల్లి గ్రామంలో వెలసిన శ్రీ కృష్ణ గీతా మందిరంలో ఈనెల 4వ తేదీ నుండి 10వ తేదీ వరకు కడప పట్టణానికి చెందిన అచ్చోలి ముంకుంద రెడ్డి ప్రవచనాలు బోధించడం జరుగుతుందన్నారు. 11వ తేదీ గీతా జయంతి కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించి మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. భగవద్గీత గ్రంథాలను ఉచితంగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

కూరగాయలు పంపిణీ



కూరగాయలు పంపిణీ చేస్తున్న సుబ్బరాజు

ఓబులవారిపల్లె : బీపీ రాచపల్లి ఎస్టీ కాలనీ గ్రామంలో టీడీపీ నాయకుడు సుబ్బరాజు ఆదివారం కూరగాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీ పనులు చేసుకునే ఎస్టీ కాలనీ వాసులు మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని తెలుసుకొని గ్రామంలోని 20 కుటుంబాలకు కూరగాయలను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓబులమ్మ సన్నిధిలో వనభోజనాలు



ఓబులమ్మకు పూజలు చేయిస్తున్న గ్రామస్తులు

సిద్దవటం : సిద్దవటం గ్రామ శివారులో వెలసిన ఓబులమ్మ అమ్మవారికి సిద్దవటం గ్రామ ప్రజలు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తిక మాస వారోత్సవాల సందర్భంగా వనభోజనాలను ఏర్పాటు చేశారు. అమ్మవారికి అభిషేకం అలంకరణ, కుంకుమార్చన అర్చనలు తీర్థప్రసాదాల వినియోగం వంటి పూజా కార్యక్రమాలను జరిపించారు.

పూజలందుకున్న నాగారపమ్మ



దర్శనమిస్తున్న నాగారపమ్మ

సుండుపల్లె : పెద్దినేని కాలువ పంచాయతీ బండకాడ ఈడిగపల్లెలో వెలసిన నాగారపమ్మ ఆదివారం ప్రత్యేక పూజలందుకున్నారు. అమావాస్యను పురస్కరించుకుని ఉదయాన్నే పూజారులు అమ్మవారిని పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనాలు, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పెనగలూరులో చిరుజల్లులు

పెనగలూరు : ఫెంగల్ ప్రభావం మండలంలో పెద్దగా కనిపించలేదు. ఆదివారం తుంపరతో సరిపెట్టుకుంది. తుపానుతో వాగులు పొంగి పొర్లుతాయని రైతులు ఆశపడ్డారు. చివరకు ఆదివారం కేవలం 8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో బోరుబావుల్లో ఏ మాత్రం నీటి మట్టం పెరగలేదని రైతులు అంటున్నారు. ఇటు భుజంగేరు, అటు చెయ్యేరు పొంగిపొర్లితేనే బోరుబావుల్లో నీటిమట్టం పెరుగుతాయని రైతులు తెలియజేశారు.

ఆహ్లాదకరం.. ఆనందభరితం

- జిల్లాకేంద్రం వాసులకు వినోద కేంద్రంగా డైట్ పార్క్
- గత వైఎస్సార్‌సీపీ పాలనలో పార్క్ నిర్మాణం, సదుపాయాల కల్పన
- మరింత అభివృద్ధి చేయాలంటున్న పట్టణ ప్రజలు



డైట్ పార్కులో కాలక్షేపం చేస్తున్న వృద్ధులు



పార్కులో ఊయల ఊగుతున్న చిన్నారులు

రాయచోటి టౌన్ : చిన్న పిల్లలు.. మలి వయస్సు వచ్చిన వారు సంతోషంగా.. ఆహ్లాదకరంగా ఉండాలని కోరుకుంటారు. అలాంటి వారికి సహజ సిద్ధమైన పొలాలు, పచ్చని చెట్లు కావాలని కోరుకుంటారు. కానీ అవన్నీ పట్టణంలో కనిపించవు. అందుకే వాటికి బదులుగా పట్టణ ప్రాంతాల్లో పచ్చని పార్కులు ఏర్పాటు చేస్తుంటారు. రాయచోటి పట్టణంలోని డైట్ హాస్టల్ ఆవరణలో పార్కును గత ప్రభుత్వం ప్రత్యేక నిధులతో నిర్మించారు. అక్కడ పార్కుతోపాటు వృద్ధులు, పెద్దలు, స్టూడెంట్స్ కోసం వాకింగ్ ట్రాక్‌ను నిర్మించారు. ఈ ట్రాక్‌పై తెల్లవారుజామున, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేస్తుంటారు. తెల్లవారిన తరువాత పిల్లలు, వృద్ధులు అక్కడికి వచ్చి సేద తీరుతుంటారు. అంతేకాదు కొందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు చెట్టు నీడన ఏర్పాటు చేసిన బెంచ్‌లపై కూర్చొని తమ విధులు (వర్క్ ఫ్రం హోం) బదులుగా వర్క్ ఫ్రం పార్క్‌గా చేసుకొంటున్నారు. అంతే కాదు మలివయస్సు వారు, రిటైర్డ్ అయిన వారు అక్కడికి వచ్చి బండలపై పులిమేక ఆడుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. ఇలా ఈ డైట్ హాస్టల్ పార్కు అన్ని వయస్సుల వారికి ఆహ్లాదకరంగా.. వినోదకరంగా మారింది.

వర్క్ ఫ్రం పార్కు చేస్తున్నాను

నేను సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. నాకు వారంలో మూడు రోజులు వర్క్ ఫ్రం హోం ఉంటుంది. ఇంటిలో స్వచ్ఛమైన గాలి, వెలుతురు ఉండదు. అందుకే ఇంటిలో టిఫిన్ తిని ఇక్కడికి వచ్చి పని పూర్తి చేసుకొని మధ్యాహ్నం భోజనానికి వెళ్తా.. తరువాత మళ్లీ వచ్చి సాయంత్రం వరకు ఇక్కడే వర్క్ పూర్తిచేసుకొని వెళ్తుంటాను. చాలా ఆహ్లాదకరమైన వాతావరణంలో హాయిగా ఉంటుంది. కానీ ఇక్కడ చాలా మంది కాలేజీకి వెళ్లే విద్యార్థులు కాలేజీకి ఎగ్గొట్టి ఈ కుర్చీలలో పబ్జీ ఆడుకుంటూ కనిపిస్తున్నారు. వారిపై కళాశాల యాజమాన్యం ఓ కన్నేసి ఉంచాలి.

– శ్యాసుద్దిన్, రాయచోటి

వారంలో రెండు రోజులైనా..

వారంలో రెండు రోజులైనా ఇలా మా పిల్లలను తీసుకొని ఇక్కడికి వస్తా. పల్లెలో పిల్లలు మట్టిలో ఆడుకుంటారు కదా వారికి నాచ్యురల్ ఇమ్యూనిటీ పవర్ లభిస్తుంది. కానీ పట్టణంలో అది లభించదు. అందుకే పిల్లలను ఇక్కడికి తీసుకొచ్చి ఆడిస్తాను. వారు ఆడుకుంటుంటే నాకు నా బాల్యం గుర్తుకొస్తుంది. రాయచోటి ప్రజలకు ఇలాంటి ఒక మంచి పార్కు ఏర్పాటు చేయడం చాలా సంతోషతగ్గ విషయం. దీనిని ఇలా మరింత అభివృద్ధి పరచాలి.

– బాలాజీ, రాయచోటి

ఇంట్లో చాలా బోరుగా ఉంటోందని..

మా పిల్లలు, మా అన్న పిల్లలు ఇంటిలో ఉండటం వలన చాలా బోరుగా ఉంటోందని ఈ పార్కుకు తీసుకొచ్చాను. కొత్తపల్లెలో కుక్కలతో బెడదతో పిల్లలను బయటకు పంపలేకున్నాం. అంతేకాదు మా వీధులు చాలా ఇరుకుగా ఉంటాయి కాబట్టి ఆటలకు ఇబ్బందిగా ఉంటుంది. అందుకే వారిని వారంలో రెండు మూడు సార్లు ఇలా ఈ పార్కుకు తీసుకొస్తా. వారు ఆడుకుంటుంటే చాలా సంతోషంగా, ఆనందంగా, ఆహ్లాదకరంగా ఉంటుంది. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన పార్కును మరింత అభివృద్ధి చేయాలి.

– జాబీర్, రాయచోటి

అంబరాన్నంటిన అంబలం పూజ



అయ్యప్ప ఉత్సవ విగ్రహానికి అభిషేక పూజలు చేస్తున్న భక్తులు

రాజంపేట రూరల్ : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రాఘవరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఎగువ సిద్దవరం మాజీ ఎంపీటీసీ, సర్పంచ్ రాఘవరెడ్డి, ప్రేమలత దంపతులు నూతనంగా థమ్స్‌అప్ గోడౌన్ వద్ద ఏర్పాటు చేసిన చెర్రీస్ స్కూల్‌లో శనివారం రాత్రి నిర్వహించిన శ్రీ అయ్యప్పస్వామి అంబలం పూజ అంబరాన్నంటింది. పూజ కార్యక్రమంలో భాగంగా గణపతి, సుబ్రమణ్యేశ్వరుడు, అయ్యప్పల విగ్రహాలను అలంకరించి ప్రత్యేక మండపాలలో కొలువుదీర్చారు.

అనంతరం కొండా సత్యనారాయణ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి ముందుగా అభిషేకాలు చేసి పడిమెట్లకు పూజలు జరిపారు. గురుస్వాములు, అయ్యప్ప దీక్షాపరులు భజనలు చేశారు. అదే విధంగా శివ డాన్స్ అకాడమికి చెందిన విద్యార్థులు నృత్యాలు ఆకట్టుకున్నాయి. పూజా అనంతరం మాలదారులకు రాఘవరెడ్డి దంపతులు భిక్షను, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో గురుస్వాములు కె.నాగరాజ, కె.రమేష్‌లతోపాటు అయ్యప్ప, శివుని, వేంకటేశ్వర స్వామి మాలలు ధరించిన భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

కార్పొరేట్ల ప్రయోజనాలకే ప్రాధాన్యత



సమావేశంలలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి

రాయచోటి అర్బన్ : పాలకులకు కార్పొరేట్ యాజమాన్యాలపై ఉన్న ప్రేమ కార్మిక శ్రేయస్సు లేకపోవడం దారుణమని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డిలు అన్నారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ ఆఫీసు బేరర్స్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ శ్రేయస్సును విస్మరించి కార్పొరేట్ ప్రయోజనాల కోసం, వారి ఆస్తులను రెట్టింపు చేయడం కోసం పనిచేస్తోందంటూ ఆరోపించారు. దేశంలోని 29 కార్మిక చట్టాలను రద్దుచేసి 4 నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మిక హక్కులను నిర్వీర్యం చేస్తున్నారన్నారు.

దేశంలో వేతన సవరణ చేయకుండా, కనీస వేతనాలను అమలు చేయకుండా కార్మికుల శ్రమను దోచుకుంటున్నారంటూ విమర్శించారు. కార్మిక హక్కుల పరిరక్షణ, కనీస వేతనాల అమలు, ఉద్యోగ భద్రత కోసం పోరాటాలు సాగిద్దామంటూ వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు రామక్రిష్ణ, సాంబశివ, ఉపాధ్యక్షుడు పీఎల్ నరసింహులు, గౌరవ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసులు, నేతలు గంగాధర్, సురేష్‌కుమార్, వేణుగోపాల్ రెడ్డి, మురళి, గాలి చంద్ర, నేలపాటి శ్రీనివాసులుతోపాటు ఏఐటీయూసీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో అమ్మవారికి విశేష పూజలు



లక్కిరెడ్డిపల్లి: శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకరణలో దర్శనమిస్తున్న అనంతపురం గంగమ్మ



సంబేపల్లె: అలంకరణలో దేవరరాయి నల్లగంగమ్మ

శ్రీ రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో అనంతపురం గంగమ్మ

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో శుద్ధి చేసి, అమ్మవారికి పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని అలంకరించి ప్రత్యేకంగా అలంకరించారు. మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు తీసుకున్నారు.

మల్లారమ్మ ఆలయంలో..

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామంలో కొలువైన శ్రీ మల్లూరమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మొక్కుబడులు తీరిన వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు. బంధుమిత్రులతో కలిసి విందును ఆరగించారు. వచ్చిన భక్తాదులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు.

లక్కిరెడ్డిపల్లి : అనంతపురం గంగమ్మ దేవత అమ్మవారు ఆదివారం శ్రీశ్రీ రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్తిక మాసం ముగియడంతో అమావాస్య కావడంతో గంగమ్మ దేవత అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారిని దర్శించుకొని అమ్మవారికి చీరలు, గాజులు సమర్పించి పూజలు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులతో పాటు మిగతా వాహనాలకు అమావాస్య రోజున పూజలు నిర్వహించారు. మండలంలోని మద్దిరాల గ్రామం వంకగడ్డ రాజుపల్లి సమీపంలో వెలసిన మారెమ్మ దేవత అమ్మవారి ఆలయంలో ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అర్చకులు వెంకటనారాయణ శాస్త్రి అమ్మవారికి అభిషేక పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. గ్రామస్తులతో పాటు మహిళలు మారమ్మ దేవత అమ్మవారిని దర్శించుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదాం



ఒంటిమిట్ట: కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

రాజంపేట రూరల్ : అపరిచిత వ్యక్తులతో సాంగత్యంను విడనాడటం వలన ఎయిడ్స్ మహమ్మారిని పారద్రోలవచ్చని డిప్యూటి డీఎంహెచ్ఓ డాక్టర్ సానే శేఖర్ పిలుపునిచ్చారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఆదివారం జాతీయ ఎయిడ్స్ డే సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సు అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. తదనంతరం ఏరియా ఆసుపత్రి నుంచి పాతబస్టాండ్ వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా డాక్టర్ శేఖర్ మాట్లాడుతూ ప్రతి మనిషి తన కాంక్షలను అదుపులో ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యుడు యాసిన్, ఐసీటీసీ కౌన్సిలర్ పి.వెంకటసుబ్బయ్య, టీబీ సూపర్‌వైజర్ పిల్లి జయప్రకాష్, సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, ల్యాబ్ టెక్నీషియన్ చైతన్య, ఏఐటీఎస్ కళాశాల విద్యార్థులు, ఏఎన్ఎంలు, ఆశలు, వైఆర్‌జీలు, ఎల్‌డబ్ల్యూలు తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో

ఒంటిమిట్ట : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన ఒంటిమిట్టలో ఎయిడ్స్ నివారణపై ఒంటిమిట్ట వైద్య అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు గ్రామస్తులతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

సుండుపల్లె : ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శేఖర్ రెడ్డి ఆదివారం ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ అనేది మన శరీరంలో వ్యాధి నిరోధక శక్తి లోపించడం వలన వస్తుందని తెలిపారు. ముఖ్యంగా కలుషిత సూదులు ద్వారా, రక్తమార్పిడి వలన, మత్తు మందులు ద్వారా, అసురక్షిత లైంగిక సంపర్కం ద్వారా, గర్భం సమయంలో తల్లి నుండి బిడ్డకు వ్యాపించే అవకాశం ఉందని పేర్కొన్నారు. హెచ్ఐవీ పరీక్ష చేయించుకుంటే వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయితే మందులను వాడి మరణాల రేటును తగ్గించవచ్చని చెప్పారు. అనంతరం సిబ్బందితో కలిసి నా ఆరోగ్యం – నా హక్కు ర్యాలీని నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వీర నారాయణ, హెల్త్ అసిస్టెంట్ గంగాధర్, నరేష్, హేమ తదితరులు పాల్గొన్నారు.



సుండుపల్లె: ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్ శేఖర్ రెడ్డి, వైద్యులు



రాజంపేట రూరల్: ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సానే శేఖర్

మానవత్వం చాటుకున్న ఆకేపాటి



రాపూరు మార్గంలో వానరాలకు స్వయంగా పండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట టౌన్ : జంతువుల పట్ల అనేక మందికి ప్రేమ ఉంటుంది. అయితే వాటిని దగ్గర ఉంచుకొని ఆకలి తీర్చడం, చిన్నపాటి ఆరోగ్య సమస్య వచ్చినా తల్లడిల్లిపోయి వైద్యం చేయించడం వంటివి అతికొద్ది మంది మాత్రమే చేస్తారు. అలాంటి వారిలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ముందువరసలో ఉంటారు. ఆయన తన ఎస్టేట్‌లో అనేక మూగజీవులను పోషిస్తున్నారు. ఉదయం నిద్రలేవగానే మూగజీవులకు సేవచేయడంతోనే ఆయన తన దినచర్య ప్రారంభిస్తారు. మూగజీవులకు విపరీతమైన మక్కువ ఉన్న అమర్‌నాథరెడ్డి ఎక్కడికి వెళ్లినా తనవెంట పండ్లు, ఇతర ఆహార పదార్థాలు తీసుకెళ్లి దారిలో కనిపించే మూగజీవులకు అందజేస్తారు. ఆ క్రమంలో ఆదివారం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో పెంచలకోనలోని నృసింహ స్వామి దర్శనానికి వెళుతూ రాపూరు ఘాట్‌లో పెద్దసంఖ్యలో ఉండే వానరాల కోసం నాలుగు గోతాల మేర పండ్లు తీసుకెళ్లి వాటికి స్వయంగా అందించారు.

నీటి బోరుకు మరమ్మతులు



వర్షంలో బోరుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలో తాగునీటి బోరు మరమ్మతులకు గురైంది. వర్షానికి నీరు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ జయపాల్ రెడ్డి ఆదివారం వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తాగునీటి బోరుకు మరమ్మతు పనులు చేయించారు. దీంతో గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

'ఎస్టీ కాలనీ ఇళ్లలో షార్ట్ సర్క్యూట్'



ఎస్టీ కాలనీ గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవుతున్న గృహాన్ని పరిశీలిస్తున్న సిపిఐ నాయకులు

ఓబులవారిపల్లె : మండలంలోని అద్దిపల్లె ఎస్టీ కాలనీలోని 40 కటుంబాలను ప్రజలు ఆదుకోవాలని మండల సీపీఐ కార్యదర్శి చింతలపూడి నాగమ్మ కోరారు. భారీ వర్షాలు కారణంగా ఆదివారం ఎస్టీ కాలనీని సీపీఐ నాయకులు సందర్శించారు. కాలనీలోని విద్యుత్ సంబంధించి వర్షానికి ఇంటి పైకప్పులు, పెచ్చులూడి కిందపడి వర్షపునీరు కారడంతో విద్యుత్ సరఫరా అవుతుందని గ్రామ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్ లేకపోవడంతో రాత్రి సమయంలో విష సర్పాలు తిరుగుతూ ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి షార్ట్ సర్క్యూట్ అవుతున్న ఇళ్లలో చర్యలు చేపట్టి గ్రామ ప్రజలను ఆదుకోవాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో కానూరు పద్మావతి, యాదగిరి వెంకటలక్ష్మీ, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభావం చూపుతున్న 'ఫెంగల్'



ఓబులవారిపల్లె: మండల కేంద్రం – జీవీపురం వెళ్లే మార్గంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



చిట్వేలి: జిల్లాలోనే పెద్దదైన ఎలమరాజు చెరువుకు చేరిన వరద నీరు

ఓబులవారిపల్లె : ఫెంగల్ తుపాను కారణంగా మండల వ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. శేషాచల అటవీ ప్రాంతంలో భారీగా వర్షం కురవడంతో వంకలు, వాగులు సాగి చెరువుల్లోకి నీరు చేరుతోంది. గుండాలేరు రెడ్డికాలువ, పాములేరు వంకలు సాగాయి. జిల్లాల మడక చెరువు, వైకోట చెరువు, కొర్లకుంట చెరువులకు వర్షపునీరు చేరుతోంది. మండల వ్యాప్తంగా శనివారం ఉదయం నుంచి ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు 106 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ కీర్తి తెలిపారు. విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా చర్యలు చేపట్టడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

పుల్లంపేట : పుల్లంగేరు నాడు నీరులేక పిచ్చిమొక్కలతో దర్శనమిస్తూ వెలవెలబోయింది. ఫెంగల్ తుపాను కారణంగా ఎట్టకేలకు ఆదివారం పుల్లంగేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రైతులు, ప్రజలు ఈ ఏడాది సాగు, తాగునీటి కొరత నుండి బయటపడవచ్చని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చిట్వేలి : ఫెంగల్ తుపాను నేపథ్యంలో చిట్వేలి గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉప సర్పంచ్ చొడవరం ఉమామహేశ్వర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. కాగా గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో వాగులు, వంకలు, చెరువులు పారుతున్నాయి. జిల్లాలో అతి పెద్ద చెరువు అయిన ఎలమరాజు చెరువుకు వరద నీరు చేరుకుంది. అలాగే తిరుపతిలో కురుస్తున్న భారీ వర్షాలకు గుంజనేరు ప్రవహిస్తోంది.

నిర్లక్ష్యానికి నిలువటద్దం

ఫొటోలో కనిపిస్తున్న రహదారి కడప – రేణిగుంట జాతీయ రహదారి. ఇటీవల ఈ రహదారిని ఎన్‌హెచ్ నుంచి ఎన్‌హెచ్ఐఏకు బదిలీ చేశారు. హైవేలో దారులు ఎటువైపు, ఎంత దూరమనేది సూచిక బోర్డులు కనిపించడంలేదు. కొన్ని నేలకొరగాయి. ఈ మార్గంగుండా మంత్రులు, జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు వెళుతున్నా.. వారు పట్టించుకోవడంలేదు. ఇలా ఎన్‌హెచ్ఏఐ తిరుపతి అధికారుల నిర్లక్ష్యానికి హైవే రూపే మారిపోయిందన్న అపవాదును మూటకట్టుకున్నారు. ఎప్పటికి సూచికబోర్డును ఏర్పాటు మారుస్తారో చూడాలని వాహనదారులు వాపోతున్నారు.

– రాజంపేట



కడప – రేణిగుంట హైవేపై రాజంపేటలో పూర్తిగా దెబ్బతిన్న ఎన్‌హెచ్ఐఏ బోర్డు



హైవేలో కుప్పకూలిన రహదారి మార్గాలను చూపే సూచికబోర్డు